వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# మహా వివాదానికి ముగింపు!

*జన్మభూమి అయోధ్యలో రామ్‌లల్లా 'విరాజ్‌మాన్' కావడం దేశ ప్రజలందరికీ పెద్దపండుగ. ముఖ్యంగా రామభక్తులు, హిందువుల్లో ఉత్సాహం మిన్నంటుతున్నది. దేశవ్యాప్తంగా ఊరూరా రామోత్సవాలు అంగరంగ వైభవంగా జరగడం మనం చూశాం. దేశాన్ని శతాబ్దాల పాటు కుదిపేసిన ఒక మహావివాదం అయోధ్యలో ఆలయ నిర్మాణంతో ఓ కొలిక్కి వచ్చినట్టయింది. అయోధ్య సమస్యకు పరిష్కారంతో దేశ వ్యాప్తంగా ఇక సయోధ్య నెలకొంటుందని ఆశించడంలో తప్పులేదు. ఈ సందర్భంగా రామరాజ్యం అనే మాట పదేపదే వినిపిస్తున్నది. నిజానికి ఆ మాటను పదేపదే ఉచ్చరించిన మహాత్ముడు 'రఘుపతి రాఘవ రాజారాం.. ఈశ్వర్ అల్లా తేరేనామ్' అని ప్రార్థించేవారు. దీనినే స్ఫూర్తిగా తీసుకొని దేశపెద్దలు మతసామరస్యం బలంగా వేళ్లూనుకునేందుకు కృషి చేయాలి. రామరాజ్యం అంటే ప్రజలను చల్లగా చూసే పాలన అనే భావన ఈ దేశంలో నాటుకుపోయింది. అది నిజం కావాలని దేశం వెయ్యికండ్లతో ఎదురుచూస్తున్నది.*

*రామునికి అయోధ్యలో ఆలయం నిర్మితమవడం అనేది కొంచెం ముందూవెనుకా జరగాల్సిన పనే. నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సామరస్యంగా ఈ సమస్య ఎప్పుడో పరిష్కారం అయి ఉండాల్సింది. కానీ, కొన్ని చారిత్రక కారణాల వల్ల అది జరగలేదు. ఫలితంగా అదొక వివాదమై కూర్చున్నది. విభజన నరమేధం నేపథ్యంలో స్వాతంత్ర్యం రావడం వంటి కారణాల వల్ల ఈ సమస్యను అప్పటి పాలకులు పెద్దగా పట్టించుకోలేదు. పైగా వైషమ్యాలకు దారి తీస్తుందని కూడా వారు భావించి ఉండవచ్చు. గత 30 ఏండ్లుగా అయోధ్య వివాదం ప్రముఖంగా ముందుకురావడం, రాజకీయాల్లో నిర్ణయాత్మక అంశంగా మారడం చరిత్ర. ఇటీవల కొందరు మైనారిటీ మేధావులు అంటున్నట్టు కొద్దిలో తేలాల్సిన సమస్య సర్దుబాట్లు జరగని కారణంగా బిగదీసుకుపోయింది. మొత్తం మీద సర్వోన్నత న్యాయస్థానం జోక్యంతో సమస్య ఓ కొలిక్కి వచ్చి వివాదాల టెంటులోంచి రామచంద్రుడు బయటపడి భవ్యమైన కోవెలలోకి చేరడం అందరికీ సంతోషం కలిగించే విషయమే. బాలరాముని చల్లని చూపులు దేశానికి శాంతి, సౌభాగ్యాలు తేవాలని అందరం కోరుకుందాం. అయోధ్య ఆలయం-రామయ్య ఒక ఆధ్యాత్మిక అంశం, భక్తి భావన.*

*అయితే గుడిలో రామయ్య కొలువుదీరిన వేళ అక్కడ జరిగిన ప్రసంగాల్లో రాజకీయం తొంగిచూడటం అంత సబబుగా అనిపించలేదు. ఆధ్యాత్మికం వేరు, రాజకీయం వేరు. ప్రజలు కోరుకున్నది రాముడిని, రాజకీయాలను కాదు. గుడి చుట్టూ అల్లుకున్న నినాదాలకు, వివాదాలకు కాలం చెల్లిందని అర్థం చేసుకోవాలి. అభివృద్ధిపై దృష్టి సారించి అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తేనే అది నిజమైన రామరాజ్యం అవుతుంది. ఇందుకు ముందుగా చేయాల్సింది దేశంలో బుసలు కొడుతున్న విద్వేషాలను పాతిపెట్టడం. మనిషిని మనిషి హింసించే అమానుషత్వాన్ని పారదోలడం. 'అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్' అన్న కవివాక్కులు నిజం కావాల్సిన తరుణమిది. పేదలను దరిద్ర నారాయణులని దైవ భావంతో చూసే సంస్కారం మనది. మానవసేవే మాధవసేవ అని నమ్మిన రోజే నిజమైన రామరాజ్యం సాకారమైనట్టు!*

# రేవంత్ ఆలోచనల్లో అనారోగ్యం!

> ఏ రాష్ట్రంలోనైనా, ఏ వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నా ఆ రాష్ట్రంపై తనదైన ముద్ర ఉండాలని ప్రతి ముఖ్యమంత్రి కోరుకుంటారు. అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుకోవడం కూడా సహజం. కానీ, తనదైన ముద్ర అంటే మెట్రో రైలు రూట్ మార్చడం, గోడలకు రంగులు మార్చడం, పేర్లు మార్చడం కాదు. రాష్ట్ర ప్రజలకు, రాష్ట్రానికి మేలు చేయడం ద్వారా బలమైన ముద్ర వేయాలి.



బుద్దా మురళి
98499 98087




'తెలంగాణ', 'రైతుబంధు' పేర్లను గుర్తుచేస్తే చాలు వెంటనే ప్రజలకు కేసీఆర్ గుర్తుకువస్తారు. రెండు రూపాయలకు కిలో బియ్యం అంటే చాలు ప్రజల కండ్ల ముందు ఎన్టీఆర్ మెదులుతారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే చాలు ప్రజలకు వైఎస్సార్ గుర్తుకువస్తారు. ఆయా అంశాల్లో వారు వేసిన బలమైన ముద్ర వల్ల వారి పేరు చెప్పగానే అవి గుర్తుకువస్తాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి ఏడు వారాలు పూర్తయింది. అందుకే రేవంత్‌రెడ్డి కూడా తనకు లభించిన అవకాశాన్ని ప్రజలకు మేలు చేయడం ద్వారా బలమైన ముద్ర వేయడానికి ఉపయోగించుకోవాలి.

1983లో ఉమ్మడి ఏపీలో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసిన పథకం రెండు రూపాయలకు కిలో బియ్యం. ఈ పథకం ప్రజలపై బలమైన ముద్ర వేసింది. ఇదిలా ఉంటే మండల వ్యవస్థ పాలనను ప్రజలకు దగ్గర చేసింది. 1989 ఎన్నికల ప్రచారంలో మండల వ్యవస్థను రద్దు చేస్తామని కాంగ్రెస్ బలంగా ప్రచారం చేసింది. మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో టీడీపీని కాంగ్రెస్ ఓడించి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో మండల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన చెన్నారెడ్డి ప్రభుత్వం మండల వ్యవస్థను రద్దు చేయలేదు. తాలూకాలు ఉన్నప్పుడు ఎంతో ఇబ్బందిగా ఉండేది, మండల వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత తమ గ్రామానికి ప్రభుత్వం చేరువైందనే భావన ప్రజల్లో బలంగా ఏర్పడింది. సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల సమస్యలు తలెత్తి ఉండవచ్చు కానీ, మండల వ్యవస్థ రద్దుచేయడం సాధ్యం కాదని చెన్నారెడ్డి గ్రహించి దాన్ని కొనసాగించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, మండల వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేయడమనేది ఎన్టీఆర్ వేసిన బలమైన ముద్ర. చంద్రబాబు రెండు రూపాయల బియ్యం నాలుగు రూపాయలుచేసినా, తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం రెండు రూపాయల బియ్యాన్ని ఉచితం చేసినా ధరల్లో మార్పు తప్ప పథకం మాత్రం కొనసాగింది. ఎందుకంటే నేటికీ అది ఎంతో కొంత ప్రజలకు మేలు చేసే పథకం.

ఎన్టీఆర్‌ను దించి అధికారంలోకి వచ్చిన కొత్తలో చంద్రబాబు ఎన్టీఆర్ పేరును చెరిపేయడానికి తీవ్రంగానే కృషిచేసి రెండు రూపాయలకు కిలో బియ్యం ధర పెంచారు. కానీ, ఎన్టీఆర్ పేరును మాత్రం చెరిపేయలేకపోయారు. ఎన్టీఆర్ మరణించిన తర్వాత ఆయన పేరును మాయం చేయాల్సిన అవసరం లేకుండాపోయింది. అదేవిధంగా వైఎస్సార్ పేరును సైతం బాబు చెరిపివేయలేకపోయారు. 2004 ఎన్నికల్లో వైఎస్సార్ ఉచిత విద్యుత్తు హామీ ఇస్తే, టీడీపీ ప్రచారంలో చంద్రబాబు మాత్రం ఉచిత విద్యుత్తు అమలుచేస్తే విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవలసిందే అని ప్రచారం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఓడిపోయి ఆరు నెలలు కూడా కాక ముందే మేము కూడా ఉచిత విద్యుత్తు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. 2014లో ఆంధ్రాలో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఉచిత విద్యుత్తు అమలుచేశారు.

ఆరోగ్యశ్రీ, 108 అనగానే వైఎస్సార్ గుర్తుకు వస్తారు. అంతమాత్రాన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక వీటిని రద్దు చేయలేదు. పైగా శాసనసభలోనే ఈ పథకాలు వైఎస్సార్ మొదలుపెట్టారని, ఆ విషయాన్నీ నిండు సభలోనే చెప్తున్నట్టు చెప్పారు. ఈ పథకాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందా? లేదా అనే దానికి ప్రాధాన్యం ఉండాలి కానీ, దాన్ని ఎవరు ప్రారంభించారు? ఎవరికి పేరు వస్తుందని కాదు. ఔషధ నగరి వల్ల వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఇలాంటి వాటి విషయంలో మరింత మందికి ఉపాధి లభించేట్టు చూడాలి కానీ, దెబ్బతీయడం వల్ల రాష్ట్ర ప్రజలకు నష్టమే తప్ప లాభం లేదు.

'హైటెక్ సిటీ' అంటే చంద్రబాబు పేరు గుర్తుకువస్తుందని తర్వాత అధికారంలోకి వచ్చినవాళ్లు దాన్నేమీ రద్దు చేయలేదు. బాబు హయాంలో కన్నా వైఎస్ హయాంలో ఐటీ ఎగుమతులు ఎక్కువ జరిగాయి. వీరిద్దరి కన్నా కేసీఆర్ హయాంలో ఐటీ ఎగుమతులు ఇంకా ఎక్కువగా జరిగాయి.

> హైటెక్ సిటీ అంటే బాబు గుర్తుకువస్తారని వైఎస్ ఐటీరంగాన్ని చిన్నచూపు చూడలేదు. ఆ తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కూడా చిన్నచూపు చూడలేదు. ఐటీ రంగంలో మరింత వృద్ధి సాధించేట్టు చర్యలు తీసుకున్నారు. ఔషధనగరి అయినా, మరేదైనా రాష్ట్రానికి మంచి చేసే అంశాలు ఎవరు ప్రారంభించారని చూడకుండా, రాష్ట్రానికి మేలు చేసేది అయితే తప్పకుండా మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. అది పాలకుడి లక్షణం.

అంతేకానీ, ఒక రాజకీయపక్షం ఓడిపోవడానికి, ఇంకో రాజకీయపక్షం గెలువడానికి అనేక కారణాలుంటాయి. ఓడిపోయిన పార్టీ చేసినవి అన్నీ తప్పేనని, గెలిచిన పార్టీ ఏం చేసినా సరైనదేనని భావిస్తే ఆలోచనల్లో అనారోగ్యం ఉన్నట్టే లెక్క. ఇక రేవంత్‌రెడ్డి విషయానికి వస్తే 'ధరణి'తో పాటు అన్నింటిని వ్యతిరేకించారు. బీజేపీ పేర్లు మార్చడం ద్వారా ఎంతో కొంత ప్రయోజనం పొందింది. ఆ పేర్ల మార్పు మతానికి సంబంధించిన అంశం కాబట్టి అది సాధ్యమైంది. ధరణితో పాటు, జిల్లాలు, ఔషధ నగరి పేర్ల మార్పు, మెట్రో రూట్ మార్పుపై రేవంత్‌రెడ్డి ఆసక్తి చూపుతున్నారు. మెట్రోకు ఉమ్మడి రాష్ట్రంలో శ్రీకారం చుడితే కేసీఆర్ పాలనాకాలంలో పూర్తయింది. అయినా మెట్రో ప్రాజెక్టును కేసీఆర్ ఖాతాలో చూడటం లేదు. అలాంటిది రూట్ మారిస్తే రేవంత్ ఖాతాలో జమవుతుందా? యాదాద్రి, ఇంటింటికీ మంచినీళ్లు, జిల్లాల ఏర్పాటు, చెరువులకు జలకళ వంటి ఎన్నో అంశాల్లో కేసీఆర్ బలమైన ముద్ర వేశారు. రేవంత్‌రెడ్డి సైతం తనకు లభించిన అవకాశాన్ని సానుకూలంగా ఉపయోగించుకొని తనదైన ముద్ర వేయాలి కానీ, విధ్వంసం చేయడం సరికాదు.

> పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పరుష పదజాలంతో విమర్శలు చేయడం ద్వారా రేవంత్‌రెడ్డి వార్తల్లో నిలిచారు. సీనియర్లను వెనక్కినెట్టి పాపులారిటీ సంపాదించడంలో ఈ విధానం ఆయనకు ఉపయోగపడి ఉండవచ్చు. రాజకీయంగా ప్రయోజనం కలిగించి ఉండవచ్చు. కానీ, ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత కూడా అదే భాష ఉపయోగించడం ఏ విధంగా ప్రయోజనం అనుకుంటున్నారో చూడాలి.

ఎంతో మంది సీనియర్లను పక్కనపెట్టి కాంగ్రెస్ హైకమాండ్ రేవంత్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. ఎన్నికల ఫలితాలు వన్‌సైడ్‌గా ఏమీ లేవు. నాలుగు సీట్ల స్వల్ప మెజారిటీ మాత్రమే ఉన్నది. కేవలం ఏడు వారాల పాలన చూసి ప్రభుత్వాన్ని బేరీజు వేయలేం. ఐదేండ్లు పాలించేందుకు ప్రజలు అవకాశం ఇచ్చారు. సర్దుకోవడానికి, ఎక్కడ ఏముందో తెలుసుకోవడానికే కొంత సమయం పడుతుంది. అందులోనూ రేవంత్‌రెడ్డికి గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా లేదు.

కాళ్లు కడిగినప్పుడే కాపురం చేసే తీరు తెలుస్తుంది అన్నట్టు... ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతతో అడుగులు వేయాలి. పీసీసీ అధ్యక్షుని పాత్ర వేరు, ఆ పాత్రలో మాట్లాడే రాజకీయ భాష వేరు. ముఖ్యమంత్రి బాధ్యత వేరు, ఈ బాధ్యతలో ఉపయోగించాల్సిన భాష వేరు. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులపై ఉపయోగించే భాషను అంతర్జాతీయ వేదికలపై ఉపయోగించడం వల్ల ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ. అది రేవంత్‌రెడ్డి గ్రహించి రాష్ట్రంపై తనదైన ముద్ర వేసి రాష్ట్ర ప్రజలకు మేలు కలిగే పాలన సాగించాలి.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)**

# విశ్వ వేదికపై రాజనీతిజ్ఞుడి ప్రసంగం

> తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం అనతికాలంలోనే కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, సాధించిన బహుముఖాభివృద్ధి, పారిశ్రామిక పురోగతి ప్రపంచాన్ని ఆకర్షించాయి. విధానాల రూపకల్పనలో కేసీఆర్ ప్రత్యేక పంథాను అనుసరించడం వల్ల కొత్త రాష్ట్రం ఏర్పడ్డ ఏడాదిలోనే పలు విదేశీ సంస్థలు తెలంగాణవైపు చూశాయి. అనేక దేశాలు, అంతర్జాతీయ వేదికల నుంచి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ఆహ్వానాలు అందాయి. ప్రపంచ ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసే స్విట్జర్లాండ్‌లోని ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) వాటిలో ఒకటి.



వనం జ్వాలా నరసింహారావు
80081 37012



తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తూనే ప్రపంచ దేశాలకు భారతదేశం మార్గదర్శకంగా నిలుస్తున్నదనే విషయాన్ని చాలా విస్పష్టంగా చెప్పారు. ప్రపంచంలోని అనేక ఆర్థిక వ్యవస్థలు అయోమయంలో, ద్రవ్యోల్బణం దిశగా పయనిస్తూ, దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పటికీ భారతదేశం మాత్రం అలా లేదని, నిలకడైన ఆర్థికాభివృద్ధితో దూసుకుపోతున్నదని సగర్వంగా ప్రకటించారు. భారతదేశ సమాఖ్య స్ఫూర్తిని కూడా అత్యద్భుతంగా వివరించారు. ఆయన ప్రసంగం ఇలా సాగింది.

'భారతదేశంలో రాష్ట్రాలది కీలక పాత్ర. ఈ విషయాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు చాలా విధులు, నిధులు, అధికారాలు, బాధ్యతలు అప్పగించింది. గతంలో ఉండే ప్రణాళికా సంఘం స్థానంలో రాష్ట్రాలకు ఎక్కువ భాగస్వామ్యం కలిగిస్తూ నీతి ఆయోగ్ అనే వ్యవస్థ ఏర్పాటైంది. ప్రధానమంత్రి అధ్యక్షుడిగా ఉండే నీతి ఆయోగ్‌లో ముఖ్యమంత్రులందరూ సభ్యులు. దీన్ని మేము 'టీమ్ ఇండియా'గా పిలుస్తున్నాం. నీతి ఆయోగ్ వేదికగా మేమంతా దేశ స్థూలాభివృద్ధికి, రాష్ట్రాల పురోగతికి కావాల్సిన కార్యాచరణను రూపొందిస్తాం. సమాఖ్య వ్యవస్థ కలిగిన భారతదేశం లాంటి దేశాల్లో రాష్ట్రాలది చాలా ముఖ్యమైన పాత్ర. మా రాష్ట్రం విషయాన్నే తీసుకుంటే, దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఇటీవలే ఏర్పడింది. కొత్త రాష్ట్రం అయినప్పటికీ మేము అద్భుతమైన పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చాం. దీనికోసం రాష్ట్ర శాసనసభలో చట్టం చేశాం. రెండు వారాల్లోనే పరిశ్రమలకు అనుమతులిచ్చే విధానాన్ని తీసుకొచ్చాం. పెట్టుబడిదారులు పారిశ్రామిక అనుమతులు పొందడం మా రాష్ట్రంలో ఓ హక్కు. ఇప్పటికే ఈ విధానం ద్వారా కేవలం మూడు నెలల వ్యవధిలోనే 56 కంపెనీలకు అనుమతులిచ్చాం. వీటి ద్వారా దాదాపు రూ.12,000 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఇది దేశాభివృద్ధికి దోహదపడే అంశం. రాష్ట్రాలు ప్రగతిశీల నిర్ణయాలు తీసుకుంటే దేశం ముందుకుపోతుంది. ఇది ప్రపంచానికి భారతదేశ వైఖరిని వెల్లడిస్తున్నది. భారతదేశం పెద్ద సంఖ్యలో వినియోగదారులున్న దేశం మాత్రమే కాదు, ఎగుమతులకు ఎక్కువ అవకాశం ఉన్న దేశమని నేను కచ్చితంగా చెప్పగలను. మా దేశం చాలా నిలకడగా పురోగమిస్తున్నది. ఈ పయనం కచ్చితంగా ఇలాగే సాగుతుంది. ముఖ్యమంత్రిగా గుజరాత్‌ను అభివృద్ధి పథంలో నడిపిన సంస్కరణాభిలాషి అయిన ప్రధానమంత్రి మాకున్నారు' అని తన ప్రసంగంలో తెలిపారు.

1500 మంది ప్రతినిధుల సమక్షంలో, అతి తక్కువ సమయంలో, చాలా సూటిగా భారతదేశ ప్రగతిపథాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణ ఎదుగుతున్న తీరును వివరించారు. తాను తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పటికీ పొరుగు దేశం వెళ్లినప్పుడు భారతీయ పౌరుడిలాగానే మెలగాలని నిర్ణయించుకుని, అందుకు తగ్గట్టుగా ఆయన వ్యవహరించారు. మన దేశం, తెలంగాణ గురించి మాత్రమే కాదు.. చైనా నుంచి మొదలుకుని ప్రపంచ దేశాల ఆర్థిక గమనం గురించి కూడా ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. తన ప్రసంగంలో భారతదేశ గొప్పతనాన్ని, తెలంగాణ రాష్ట్ర ప్రాముఖ్యాన్ని, పురోగతిని వివరించిన కేసీఆర్.. మంచి ఎక్కడున్నా స్వీకరించే గుణం తమకున్నదని చాటిచెప్పారు. చైనా నుంచి కూడా నేర్చుకుంటామనే సంకేతాలిచ్చారు. దేశంపై, ప్రపంచంపై తనకున్న అభిప్రాయాలను చెప్పే క్రమంలో కేసీఆర్ ఎక్కడా తొట్రుపాటుకు కానీ, మొహమాటానికి కానీ పోలేదు. ఉన్నదున్నట్టు కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.

'హైదరాబాద్ నగరంలో మౌలిక వసతులను కల్పిస్తున్నాం. అత్యుత్తమ పారిశ్రామిక విధానాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నాం. అందుకు చాలా నిధులు ఖర్చు చేస్తున్నాం. భారత్ పెట్టుబడులకు అనువైన దేశం. మా దేశంలో ఎక్కడైనా, ముఖ్యంగా పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ రాష్ట్రానికి రావాలని కోరుతున్నాను. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన, అందుకు సరిపడా భూమి మా రాష్ట్రంలో అందుబాటులో ఉన్నది. మా రాష్ట్రంలో అమల్లో ఉన్న పారిశ్రామిక విధానాన్ని మించినది ప్రపంచంలో మరెక్కడా లేదని చెప్పగలను. ప్రపంచంలో చాలా చోట్ల సింగిల్ విండో విధానాలు ఉన్నప్పటికీ, మా రాష్ట్రంలో వాటన్నిటికీ భిన్నంగా ఊచలు లేని (వితౌట్ గ్రిల్స్) ఏక గవాక్ష విధానం అమల్లో ఉన్నది. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతుల మంజూరులో జాప్యం జరిగితే సంబంధిత అధికారిదే బాధ్యత. వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా ఉంటాయి. అనుమతులు పొందడం పారిశ్రామికవేత్తల హక్కుగా విధానాన్ని రూపొందించాం. నిర్దేశిత గడువులోగా కారణం చెప్పకుండా అనుమతులు ఇవ్వని పక్షంలో సంబంధిత పారిశ్రామికవేత్త అనుమతి లభించినట్టే భావించి ముందుకు సాగవచ్చు. భారత దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాను. కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని విజ్ఞప్తి చేస్తున్నాను' అని తన ప్రసంగాన్ని కేసీఆర్ ముగించారు.

దేశం అభివృద్ధి చెందడమంటే, ఆ దేశంలోని పేదల స్థితిగతుల్లో మార్పులు రావడం అని కేసీఆర్ 'ప్రపంచ ఆర్థిక వేదిక' సాక్షిగా తేల్చిచెప్పారు. ఆయిల్ ధరల్లో తగ్గుదల వచ్చినందున ఆ అవకాశాన్ని పేదల కోసం ఉపయోగించుకోవాలనే సందేశాన్ని కూడా కేసీఆర్ భారత ప్రభుత్వానికి పంపినట్టయింది. పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే అభివృద్ధి లక్ష్యంగా మారాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పేద ప్రజల సంక్షేమం గురించి తెలంగాణ ఆలోచిస్తున్నదని, ప్రపంచం కూడా అలాగే ఆలోచించాలని కేసీఆర్ తేల్చిచెప్పారు.

**(2015లో దాలియాన్ నగరంలో జరిగిన 'ప్రపంచ ఆర్థిక వేదిక' సదస్సులో 'ఎమర్జింగ్ మార్కెట్స్ ఎట్ క్రాస్ రోడ్స్' అంశంపై రాజనీతిజ్ఞతతో కూడిన కేసీఆర్ ప్రసంగం)**

> కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపుగా 50 రోజులు కావస్తున్నది. పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చింది. కనుక ఇంకా గెలుపు జోష్ ఉండాల్సిందే. కానీ కాంగ్రెస్ నాయకులెవరినీ చూసినా వారిలో ఆ ఉత్సాహం కరువైంది. ఉత్సాహం కన్నా అసహనమే ఎక్కువగా కనిపిస్తున్నది.

# ముందున్నది ముసళ్ల పండుగ



రచ్చ దినేష్
89787 40475




ఇచ్చిన హామీలు నిలబెట్టుకోమంటే కాంగ్రెస్ నాయకులకు కోపం తన్నుకొస్తున్నది. ముఖ్యమంత్రి సహా ఏ మంత్రిని కదిలించినా ఇదే తంతు. అసలు ఎందుకంత కోపం? ఎందుకంత ఫ్రస్టేషన్? మీరు చెప్పిన హామీలను గుర్తుచేస్తే తప్పా..? ఇప్పుడు కొంతమంది మాత్రమే ప్రశ్నిస్తున్నారు. ఇంకొన్ని రోజులైతే ప్రతిపక్షాలు, మీడియా, మేధావులు, యూట్యూబ్ చానెళ్లు, ప్రజలు అందరూ ప్రశ్నిస్తారు. అప్పుడు వారందరిపైనా ఇదే కోపం చూపిస్తారా? అలాగైతే గత పదేండ్లుగా బీఆర్‌ఎస్ నాయకులు ఎంత కోపానికి రావాలె? నిజానికి గత పదేండ్లుగా బీఆర్‌ఎస్ ఎదుర్కొన్నంత ప్రశ్నల దాడిని దేశంలో ఏ ప్రభుత్వం ఎదుర్కోలేదు. అయినా సరే ఆ దాడిని తట్టుకుంటూ పరిపాలన సాగించింది బీఆర్‌ఎస్.

ఇప్పుడున్న సోషల్ మీడియా కాలంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా సరే ఈ ప్రశ్నల దాడిని ఎదుర్కోవాల్సిందే. అందుకు కాంగ్రెస్ మినహాయింపు అనుకుంటే అది తప్పే అవుతుంది. నిజానికి 2016లో దేశంలో సోషల్ మీడియా విప్లవం మొదలైంది. ఈ క్రమంలో ఏ అర్హత లేని కొంతమందికి ఇదొక ప్లాట్‌ఫామ్ అయింది. వాళ్లంతా జర్నలిస్టులమని చెప్పుకొంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామనుకుంటూ యూట్యూబ్ చానెళ్లను స్టార్ట్ చేశారు. వారికి ఆదాయమంటే వ్యూస్ మాత్రమే. మరి వ్యూస్ కావాలంటే ప్రభుత్వాన్ని పొగిడితే రావు. కనుక విమర్శించటమే ముఖ్యం. దానికి ఓ ఫ్యాన్సీ పేరు.. ప్రశ్నించే గొంతుకలమని. అయితే సాంప్రదాయంగా ప్రశ్నిస్తే చూసేవారే లేరు. అందుకే ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రులను బూతులు తిట్టాలి. వ్యంగ్యంగా మాట్లాడాలె. అప్పుడే ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటది. కొంతమంది అయినా చూస్తారు. గతంలో లేని విధానం కనుక చాలా మంది వ్యూవర్స్ కూడా ఇలాంటి చానెళ్లను చూడటం మొదలుపెట్టారు. సాధారణ న్యూస్ చానెళ్లలో ఇలాంటి స్పైసీ, గాసిప్స్, ఆధారం, ఆలోచన లేని వార్తలు ఉండవు. కనుక కొంతమంది వీటిని చూడటం మొదలుపెట్టారు. వీటికి ఆదరణ పెరిగింది. దీంతో మిగతా మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా కొంతవరకు ఈ ప్రభావానికి గురైంది. ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా మొత్తం ఏ అంశానికైనా రకరకాల ఉద్దేశాలు ఆపాదిస్తూ, కోడిగుడ్డు మీద ఈకలు పీకుతూ, తప్పుడు ప్రచారాలను షురూ చేస్తున్నాయి. వీటిని అరికట్టడమనేది సాధ్యం కాని స్థాయికి వెళ్లిపోయింది.

అయితే ఈ తరహా ప్రశ్నించే గొంతుకలు మొదలైన నాటి నుంచి తెలంగాణలో బీఆర్‌ఎస్సే అధికారంలో ఉన్నది. కొత్త తరహా ప్రశ్నలతో, కోడిగుడ్డు మీద ఈకలు పీకే జర్నలిజానికి అసలుసిసలు బాధిత పార్టీగా మారింది బీఆర్‌ఎస్. నిజానికి దేశవ్యాప్తంగా సోషల్ మీడియా ఉన్నప్పటికీ తెలంగాణలోని అధికార పార్టీకి మాత్రమే దీని సెగ తగిలింది. మిగతా రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి ఇంత తీవ్రంగా లేదు. ఎంటర్‌టైన్‌మెంట్, గాసిప్స్, తిట్లతో కూడిన సోషల్ మీడియా న్యూస్‌కు సహజంగానే ఆదరణ పెరిగింది. దీంతో మేధావులు, బుద్ధిజీవులు, సంఘజీవులు కూడా తమ యూట్యూబ్ చానెళ్ల కోసం ఇదే తరహా విధానాన్ని ఎన్నుకున్నారు. ప్రభుత్వాన్ని తిట్టేవారికే వ్యూస్ రావటంతో ఇక అందరూ అదే దారి పట్టారు. దీంతో అధికారంలో ఉన్న పార్టీకి స్వేచ్ఛ లేకుండా పోయింది. గతంలో ఒకటి, రెండు హామీలు ఇచ్చి తప్పించుకున్నా పెద్దగా పట్టించుకున్న పరిస్థితి ఉండేది కాదు. ప్రజలు కూడా పరిస్థితిని అర్థం చేసుకునే వాళ్లు. కానీ ఇప్పుడు అలా కాదు, చెప్పింది చేయాల్సిందే. లేదంటే ప్రశ్నించే సమూహం ఊరుకోదు. అందుకే బీఆర్‌ఎస్‌ను పట్టి పీడించారు. ప్రశ్నలతో వేధించారు. ప్రతిదానికీ తప్పుడు అర్థాలు తీశారు. ఈ దాడంతా అధికార పార్టీ మీదే కావటంతో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ దీన్ని ఎంజాయ్ చేసింది. అలాంటివారిని ప్రోత్సహిస్తూ తమ పార్టీ గెలుపు కోసం వాడుకున్నది.

కానీ, ఇప్పుడు కాంగ్రెస్‌కు ఆ సెగ ఏమిటో తెలిసివస్తది. ఎందుకంటే ఇప్పుడున్న ప్రశ్నించే సమూహానికి తమ, పర భేదమేమీ లేదు. వారికి కావాల్సింది వ్యూసే. అవి ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే వ్యూస్ వస్తాయి. ఒకరిద్దరు వారి స్వప్రయోజనాల కోసం అధికారపార్టీకి కొమ్ముకాస్తే వారిని ఇప్పుడున్న సోషల్ మీడియా, ప్రజలు చీల్చిచెండాడటం ఖాయం. కాబట్టి కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఇవ్వాల్సిన మరొక గ్యారెంటీ ఏమంటే ఎంత ప్రశ్నించినా సహనం కోల్పోమని, బీఆర్‌ఎస్ మాదిరిగా ప్రశ్నించే వారికి స్వేచ్ఛనిస్తామని.




రాష్ట్ర నిధులను
భారీగా తగ్గించేందుకు
రహస్యంగా ప్రయత్నించిన
ప్రధాని మోదీ

## ఒంటరిగానే బరిలోకి

*కాంగ్రెస్ పార్టీ ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తున్నది. రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయయాత్ర పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశిస్తున్నదనే విషయాన్ని కూడా మాకు చెప్పలేదు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఎన్నో ప్రతిపాదనలు పంపించాం. వాటన్నింటినీ కాంగ్రెస్ తిరస్కరించింది. అందుకే మేం ఒంటరిగానే బరిలోకి దిగుతున్నాం.*

**- మమతా బెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

